

కుమరం భీం వర్ధంతి

జైనూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బస్టాండ్ కూడలిలో శుక్రవారం కాసుపటేల్‌గూడ, సోనుపటేల్‌గూడ ఆదివాసులు కుంరంభీం వర్ధంతి, దసరాపండుగను ఘనంగా జరుపుకున్నారు. కుమరంభీం, జైనూర్ గ్రామవ్యవస్థాపకుడు కాసుపటేల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాభీం మనుమడు కుమరం సోనేరావ్, డీఎస్పీ కరుణాకర్, సీఐ రామారావ్ ఆదివాసులతో కలిసి ప్రత్యేకపూజలుచేసి నివాళులు అర్పించారు. అనంతరంఆదివాసులు నృత్యాలుచేశారు. కార్యక్రమంలో మండల సహకారచైర్మన్ కొడప హన్నుపటేల్, మాజీజడ్పీటీసీ కొడప విశ్వంరావ్, మార్కెట్‌కమిటీ మాజీవైస్‌చైర్మన్ సెడ్మకీసీతారాం, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

'మహా' ఎన్నికలకు సహకారం అందించాలి

● వీసీలో జిల్లా ఎస్పీతో మహారాష్ట్ర డీజీపీ రష్మి శుక్ల



వీసీలో పాల్గొన్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సరిహద్దు రాష్ట్రాల అధికారులు సహకారం అందించాలని మహారాష్ట్ర డీజీపీ రష్మిశుక్ల అన్నారు. శుక్రవారం మహారాష్ట్ర సరిహద్దున ఉన్న డీజీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. మహారాష్ట్రలోకి ఎటువంటి అక్రమ కార్యకలాపాలు జరకుండా చూడాలన్నారు. ఈసందర్భంగా జిల్లాఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మనజిల్లాకు మహారాష్ట్రప్రాంతంతో అధికప్రాంతం సరిహద్దు కలిగి ఉందన్నారు. మహారాష్ట్రప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో నాలుగుచెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. వాటిద్వారా అక్రమంగా డబ్బులు, మద్యం ఇతరవస్తువులను తరలించకుండా పటిష్టమైన ఏర్పాట్లుచేసినట్లు తెలిపారు. మహారాష్ట్రలో జరగబోయే ఎన్నికలను దృష్ట్యా మావోయిస్టుల కదిలికలు, సరిహద్దుప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

బయటి మార్కెట్లో.. ఈఎస్ఐ మందులు

● కరీంనగర్‌లో అమ్ముతుండగా పట్టుకున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు



కాగజ్‌నగర్, అక్టోబరు 25: ఈఎస్ఐ డిస్పెన్సరీలో రోగులకు ఇవ్వాల్సిన మందులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. మూడురోజుల క్రితం కరీంనగర్ జిల్లాలోని ఉస్మాన్‌పురవద్ద గల మెడికల్ షాపులో కాగజ్‌నగర్ డిస్పెన్సరీ ఫార్మాసిస్టు మురళి ఈఎస్ఐ మందులు అమ్ముతుండగా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. ఈ అమ్మకాల్లో రూ.4.80లక్షల విలువగల డ్రగ్స్ అమ్మినట్టు తెలుస్తోంది.

పక్కాప్రణాళిక ప్రకారం కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కార్తీక్, భరద్వాజ్, శ్రవణ్, చందన కాగజ్‌నగర్ ఈఎస్ఐ నుంచి మందులు తరలిస్తున్న వాహనాన్ని వెంబడించి పట్టుకొని ఈ దందాలో పాల్గొన్న వారందరిపై కేసులు నమోదు చేశారు. కార్మికులకు, కార్మికుల కుటుంబాలకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన ఈఎస్ఐ డిస్పెన్సరీ మందులను బయటి మెడికల్ షాపులకు విక్రయిస్తుండడంపై ప్రజలు మండిపడుతున్నారు. రోగులకిచ్చే మందులను సొంతానికి అమ్ముకోవటం అధికారు తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండ్రోజులుగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు కాగజ్‌నగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీలో స్టాక్ ఎంత ఉన్నది..? ఎంత మేర రోగులకిచ్చారు..? అనే కోణంపై సమగ్ర విచారణ జరిపారు. ఈ నివేదికలను ఈఎస్ఐ డైరెక్టర్‌కు అందజేశారు. డిస్పెన్సరీ ఫార్మాసిస్టు మురళిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నివేదికలో పేర్కొన్నారు.

ఇంకా ఎంత మంది ఉన్నారు?

కాగజ్‌నగర్ ఈఎస్ఐ డిస్పెన్సరీలోని మందుల అమ్మకాల్లో ఇంకా ఎంతమంది ఉన్నారనే విషయంపై అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ డిస్పెన్సరీలో ఎప్పటినుంచి ఈ వ్యవహారం నడుస్తోందనే విషయంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇలా ఒక్క కరీంనగర్‌లోనే విక్రయిస్తున్నారా.. మరెక్కడైనా విక్రయిస్తు న్నారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. ఇంకా ఎంత మంది ఈ వ్యవహారంలో ఉన్నారనే విషయమై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ఈఎస్ఐ కార్డుదారులు డిమాండు చేస్తున్నారు. ఈఎస్ఐ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. నెలనెలా తనిఖీలు చేసి.. ఎంతస్టాక్ ఉంది..? ఎంత మిగిలింది..? అనే కోణంలో ప్రతినెల నివేదికలు తెప్పించుకుని విచారణ జరిపిస్తే దొడ్డిదారిన అమ్మకాలు జరిగేవి కావని పలువురు పేర్కొంటున్నారు.

పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నాం..

- డాక్టర్ జగన్, ఈఎస్ఐ సూపరింటెండెంట్

ఈఎస్ఐ డిస్పెన్సరీలోని మందులను బయట విక్రయించడంపై విచారణ చేస్తున్నాం. స్టాక్‌పై కూడా విచారణ చేపడుతున్నాం. ఈ విషయాన్ని ఈఎస్ఐ డైరెక్టర్‌కు సమాచారం అందించాం. పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

పత్తికి క్వింటాలుకు రూ.12వేలు ఇవ్వాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆసిఫాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): క్వింటాలు పత్తికి రూ.12వేల మద్దతు ధర ఇవ్వాలని బీసీ సంక్షేమసంఘం నాయకులు శుక్రవారం అదనపుకలెక్టర్ దాసరి వేణుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లాఅధ్యక్షుడు రూప్‌నార్ రమేష్ మాట్లాడుతూ దళారులు ఊర్లలో తిరిగి రైతులకు తూకంలో మోసం చేస్తూ దోచుకుంటున్నారన్నారు. సీసీఐ పూర్తిస్థాయిలో పత్తి కొనుగోలు చేయాలన్నారు. క్వింటాలకు రూ.12వేల మద్దతు ధర ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జక్కన్న, మారుతి, శంకర్, లహుకుమార్, శంకర్, రాజన్న, కేదారి గౌడ్, రవికాంత్, వెంకన్న, మధుకర్, శ్రీనివాస్, నారాయణ, శ్రీనివాస్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీఐలు



ఎస్పీకి మొక్కను అందజేస్తున్న కాగజ్‌నగర్ సీఐ రాజేంద్రప్రసాద్

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రెబ్బెన, కాగజ్‌నగర్ టౌన్‌సీఐలుగా బాధ్యతలు చేపట్టిన బుద్దేస్వామి, రాజేంద్రప్రసాద్ శుక్రవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. బాధితులకు సత్వరన్యాయం చేకూర్చే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు.

పశుగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

● అదనపు కలెక్టర్ దాసరి వేణు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుగణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపుకలెక్టర్ దాసరి వేణు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని తనచాంబర్‌లో జిల్లా పశువైద్యాధికారి సురేష్‌కుమార్, వైద్యాధికారులతో కలిసి 21వఅఖిలభారత పశుగణన, తెలంగాణ కార్యక్రమ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 21వ అఖిలభారత పశుగణన తెలంగాణకార్యక్రమం ఫిబ్రవరి28,2025వరకు కొనసాగు తుందన్నారు. ప్రతిఇంటికి వెళ్లి పశువుల వివరాలు సేకరించి ప్రభు త్వం నిర్ణయించిన ఆన్‌లైన్‌పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. జిల్లాలోని 15మండలాల్లో పశుగణన సర్వేకు 86మంది ఎన్యుమరేటర్లు, 11మంది సూపర్‌వైజర్లను నియ మించామన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వేను సమర్థ వంతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో నోడల్‌అధికారి డాక్టర్‌విజయ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

భయం గుప్పిట్లో అటవీగ్రామాలు

● సరిహద్దుల్లో ఏనుగు సంచారంపై ఆందోళన ● నలుగురు సభ్యులతో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు



పెంచికలపేట మండలంలోని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

పెంచికలపేట/చింతలమానేపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు అటవీప్రాంతమైన గడ్చిరోలి అటవీప్రాంతంలో ఏనుగు కదిలికలు జిల్లాలోని అటవీగ్రామాల ప్రజలను ఆందోళనకు గురిచేస్తు న్నాయి. ఏ క్షణంలో ఏనుగు గ్రామాల మీద విరుచుకుపడుతుందోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. జిల్లాకు 30కిలోమీటర్ల దూరంలో ఏనుగు ఉన్నట్లు సమాచారం ఇటు ప్రజలకు అటు అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

గ్రామస్థులకు అవగాహన..

అటవీశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒంటరిగా ఎవరూ చేన్లలోకి వెళ్లకూడదని, ఏనుగు వెంబడించే ప్రయత్నంగాని, ఫొటోలుతీసే ప్రయత్నం గాని చేయకూడదని తెలిపారు. అలాగే ఏనుగుకు ఎలాంటి హాని తలపెట్టవద్దని అది తారాస పడితే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు..

ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్ల మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వ హించారు. ఏనుగు కదిలికలపై ఆరాతీశారు. పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఎఫ్ఆర్వో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై నలుగురు సభ్యులతో కూడిన హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అటవీప్రాంత గ్రామాలైన కొండపల్లి, లోద్పల్లి, కమ్మర్‌గాం, మురళీగూడ గ్రామాల్లో గ్రామానికి నలుగురు సభ్యులను ఏర్పాటు చేశారు. అలాగే 15మంది ఎనిమల్ ట్రాకర్స్‌ను అందుబాటులో ఉంచారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్‌ను వివరణ కోరగా యాక్షన్ ప్లాన్ ఆఫ్ ఎలిఫెంట్ మూమెంట్‌లో భాగంగా మండల అటవీశాఖ సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు కదిలికలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

బుద్ధుడి బోధనలు ప్రపంచానికే ఆదర్శం



పూజలు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

వాంకిడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడి బోధనలు ప్రపంచానికే ఆదర్శమని బీఎస్ఐ(బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్‌ఇండియా) బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. మండలకేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో నిర్వహించిన వర్షవాస్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా అంబేద్కర్, గౌతమబుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేసినివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మూడు నెలలపాటు గౌతమ బుద్ధుడి జీవితచరిత్రపై గ్రంథపఠనం నిర్వహించడం అభినందనీయమన్నారు. బుద్ధుడిమార్గాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. అనంతరం అభ్యుదయ ఆర్ట్స్‌అకాడమి ఆధ్వర్యంలో శరణం గచ్ఛామి అనే నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో జైరాం, సునీల్‌కుమార్, ప్రశాంత్, సందీప్, విలాస్, ప్రసాద్, అరుణ్,రామాబాయి మహిళామండలిసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బురదగూడలో గ్రామసభ

కాగజ్‌నగర్, అక్టోబరు 25: కాగజ్‌నగర్ మండలం బురదగూడలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ 2024-25 పనులకు సంబంధించిన వాటిని ఎంపిక చేసేందుకు గ్రామ సభ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో బుచ్చయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శకళాశాలకు చెందినవిద్యార్థి చిన్నవేణి మల్లికార్జున్ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్, పీడీతిరుపతి తెలిపారు. ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు మహేష్, రాకేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

కాగజ్‌నగర్‌లో లారీ అసోసియేషన్ సభ్యుల రాస్తారోకో



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిషోర్ బాబు

కాగజ్‌నగర్, అక్టోబరు 25: సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కాగజ్‌నగర్‌లో లారీఅసోసియేషన్ సభ్యులు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం వరకుర్యాలీగా అసోసియేషన్ సభ్యులు వెళ్లారు. అనంతరం కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడుకిషోర్‌బాబు మాట్లాడుతూ ఎస్పీఎంమిల్లుకు ముడిసరుకు లారీలు అధికలోడ్‌తో వస్తున్నాయని, వెంటనే వాటిని అరికట్టాలని కోరారు. అధికలోడ్ లారీలతో గతంలో ప్రమాదాలు జరిగాయన్నారు. అనంతరం మళ్లీ ర్యాలీగా వెళ్లి అరగంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఎస్పీఎం యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లారీ అసోసియేషన్ సభ్యులకు మద్దతుగా కాగజ్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియాలోని వాణిజ్య సముదాయాల వారు బంద్‌లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మాజీమున్సిపల్ చైర్మన్ దస్తగీర్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మోహిన్, కౌన్సిలర్లుపాల్గొన్నారు. పట్టణసీఐ రాజేంద్ర ప్రసాద్,ఎస్సై దీకొండ రమేష్, సుధాకర్, రామన్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

కష్టపడి చదవి ఉన్నత స్థాయికి ఎదగాలి

సిర్పూర్(యు), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడిచదివి ఉన్నతస్థాయికి ఎదగాలని డీఎస్పీ శివశంకర్ గౌడ్, జైనూర్‌సీఐ రమేష్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని కేజీబీవీపాఠశాలలో పోలీస్‌అమరవీరుల సంస్కరణ కార్యక్రమంలోభాగంగా ఇటీవల నిర్వహించిన వ్యాసరచనపోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి ఎదగవచ్చన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిర్పూర్(యు) ఎస్సై రామకృష్ణ, ఖమాన ఎస్సై రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాతరుణాలను సకాలంలో చెల్లించాలి

లింగాపూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాతరుణాలను సకాలంలో చెల్లించాలని తెలంగాణ గ్రామీణబ్యాంక్ రీజినల్‌మేనేజర్ ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం ఆయన మండలకేంద్రంలో వీవో సంఘాలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాతరుణాలను చెల్లించినవారికి కొత్తరుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎంఅన్నాజీ, ఏపీఎం దేవానందం, బ్యాంక్ మేనేజర్ ముఖేష్‌పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కాగజ్‌నగర్, అక్టోబరు 25: కాగజ్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలపై శుక్రవారం అవగాహనకార్యక్రమాన్ని నిర్వహించారు. ఫైర్‌ఆఫీసర్ భీమయ్య మాట్లాడుతూ అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిప్రమాదం సంభవిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఇఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి



బెజ్జూరులో రోడ్డుపై బైఠాయించిన రైతులు

బెజ్జూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా ప్రాణహిత, పెద్దవాగు పరివాహక తీర ప్రాంతాల్లో నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని శుక్రవారం మండలకేంద్రంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్క మండలాలైన రైతులకు పరిహారం ఇచ్చిన ప్రభుత్వం ఇక్కడి రైతులకు మాత్రం ఇవ్వడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వచ్చి న్యాయం చేసేవరకు ఆందోళన విరమించేది లేదని రోడ్డుపైనే బైఠాయించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ భూమేశ్వర్, సీఐ రమేష్ అక్కడికిచేరుకుని రైతులతో మాట్లాడారు. పంటనష్టంపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. రైతులకు నాయకులు బషరత్‌ఖాన్, సకారాం, శ్రీనివాస్, శంకర్, సత్తయ్య, గంగారాం, పెంటయ్య, అమృత తదితరులు మద్దతు పలికారు.

వ్యవసాయశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత..



కాగజ్‌నగర్‌లో సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెజ్జూరు మండలంలో భారీ వర్షాలతో పంటనష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే హరీష్ బాబు శుక్రవారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని తలాయి, తిక్కపల్లి, పాపన్‌పేట, మొగవెల్లి, ఇప్పలగూడ, సోమిని, పాత సోమిని, గెర్రెగూడ, నాగెపల్లి, తదితర గ్రామాల్లో పంటనష్టం తీవ్రంగా జరిగిందన్నారు. అధికారులు తూతుమంత్రంగా సర్వే చేపట్టి చేతులు దులుపుకున్నారని ఫిర్యాదు చేశారు. బాధ్యులైన వ్యవసాయాధికారులపై చర్యలుచేపట్టి, పంపిన నివేదికల ఆధారంగా నైనా పరిహారం త్వరగా అందజేయాలని పేర్కొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత..

కాగజ్‌నగర్: బెజ్జూరు మండల రైతులకు వెంటనే పంట నష్టపరిహారం అందించాలని మాజీ జడ్పీటీసీ పుష్పలత, టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వరదలతో రైతులు తీవ్రంగా పంట నష్టపోయినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీ ఆత్రం సాయి, నాయకులు నాహిర్‌అలీ, రేణిగుంట్ల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎం యాజమాన్యం తప్పుడు ప్రకటనలు చేస్తోంది

కాగజ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం యాజమాన్యం లారీ అసోసియేషన్‌పై తప్పుడు ప్రకటనలు చేస్తోందని లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లారీఅసోసియేషన్, ట్రాన్స్‌పోర్టర్ల మధ్య ఒప్పందం జరిగిందని, ఎస్పీఎం యాజమాన్యం అత్యుత్సాహం ప్రదర్శించి తప్పుడు ప్రకటనలు చేస్తోందన్నారు. గతంలో చర్చలు జరిపినా ఇంతవరకు పురోగతి లేదన్నారు. కానీ యాజమాన్యం మాత్రం తమదే తప్పు అన్నట్టు ప్రకటనలు జారీచేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఎస్పీఎం యాజమాన్యం తమపై తప్పుడు ప్రకటనలు చేయడం మానుకోవాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ

రెబ్బెన, అక్టోబరు 25: రెబ్బెన సీఐగా బుద్దెస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలన్నారు. గ్రామాల్లోకి అపరిచితులు వస్తే తమకు సమాచారం అందించాలన్నారు. అలాగే రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

హైకోర్టు జడ్జిని కలిసిన సీపీ, కలెక్టర్



హైకోర్టు జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీ

జైపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లాలో శనివారం ప్రారంభ కార్యక్రమాల కోసం జైపూర్ ఎస్టీపీపీ గెస్ట్‌హౌజ్‌కు వచ్చిన హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్‌ను శుక్రవారం రాత్రి రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్, కలెక్టర్ కుమార్‌దీపక్, మంచిర్యాల డీసీపీ భాస్కర్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్జికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రారంభం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫోరెన్సిక్ ల్యాబ్ శుక్రవారం ప్రారంభమైంది. ప్రభుత్వం రాష్ట్రంలో రెండు కొత్త రీజినల్ ఫోరెన్సిక్ లాబొరేటరీలను ఏర్పాటు చేయగా నస్పూర్‌లో ప్రారంభించారు. కమిషనరేట్ పరిధిలో కేసులతోపాటు కుమరంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల కేసులను పరీక్షించనున్నారు.

మహారాష్ట్రకు తరలిస్తున్న మద్యం పట్టివేత

కోటపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సిర్సా గ్రామ సరిహద్దులోని ఫెర్రీపాయింట్ వద్ద పట్టుకున్నారు. కారులో ప్రాణహిత పరిసర గ్రామాలకు అక్కడి నుంచి నాటుపడవల్లో మహారాష్ట్రకు తరలించేందుకు ప్రయత్నిస్తుండగా రూ.45 వేల విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ పేర్కొన్నారు. సిర్సా గ్రామానికి చెందిన కారు డ్రైవర్ పెండ్యాల కిరణ్ మంచిర్యాలలోని లక్ష్మీబాలాజీ వైన్స్‌లో మద్యాన్ని తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐ లచ్చన్న పాల్గొన్నారు.

బెటాలియన్‌లో ఓపెన్ హౌజ్

హాజీపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం గుడిపేటలోని 13వ బెటాలియన్‌లో ఓపెన్‌హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ వెంకట రాములు పాఠశాలల విద్యార్థులకు ఆయుధాల పనితీరు, పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు కాళిదాసు పాల్గొన్నారు.

భీమారం (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు గొప్పవని ఎస్‌ఐ శ్వేత పేర్కొన్నారు. బస్టాండ్ ఆవరణలో పోలీసు అమరవీరుల సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయమన్నారు.

రక్తదానంలో యువత ముందుండాలి



బెల్లంపల్లిలో రక్తదానం చేస్తున్న ఏసీపీ, సీఐ

బెల్లంపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడంలో యువత ముందుండాలని ఏసీపీ రవికుమార్ అన్నారు. శుక్రవారం పద్మశాలి భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించగా ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం ఎంతో అవసరం ఉంటుందని, యువత రక్తదానం చేయాలని సూచించారు. ఏసీపీతో పాటు తాండూర్ సీఐ కుమారస్వామి రక్తదానం చేశారు. శిబిరంలో 233 యూనిట్ల రక్తం సేకరించారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాండూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రేచిని రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రామగుండం జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. స్టేషన్‌లోని రెండో నెంబరు ప్లాట్‌ఫారం సమీపంలో కాజీపేట వైపు వెళ్లే రైలు కింద పడి మృతిచెందాడని తెలిపారు. వయస్సు 50నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఉదయం కదులుతున్న రైలులో నుంచి లేదా రైలు ఎక్కే క్రమంలో కిందపడి ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. ఎడమ భుజంపై పుట్టు మచ్చ ఉందని, రెండు చేతులపైన పచ్చబొట్టు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చినట్లు తెలిపారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య



విజయలక్ష్మి(ఫైల్)

భీమారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పద్మశాలి వార్డుకు చెందిన మచ్చ విజయలక్ష్మి(31) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విజయలక్ష్మి కొంత కాలంగా కడుపునొప్పి, అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి సోదరుడు ఎంగిలి రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్వేత తెలిపారు.

మానసిక వేదనతో ఒకరి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

రెబ్బెన, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రాంటెంకి వెంకటేష్(48) వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. స్థానిక ఫెర్టిలైజర్ దుకాణంలో పనిచేస్తున్న వెంకటేష్‌కు మంచిర్యాలకు చెందిన పుష్పతో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. పంచాయతీ పెట్టి మందలించగా, సదరు మహిళ, ఆమె సోదరుడు కలిసి వెంకటేష్‌ను బెదిరించారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో మానసికంగా కుంగిపోయిన వెంకటేష్ ఈ నెల 24న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు మంచిర్యాలకు, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. వెంకటేష్ భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దంపతులపై కేసు నమోదు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన దంపతులు ఒకరికొకరు దాడి చేసుకున్న ఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రాజీవ్‌నగర్‌కు చెందిన ఎండి.ఇలియాజ్, రైసాభాను భార్య, భర్తలు కొంతకాలంగా గొడవపడుతున్నారు. ఈ నెల 14న రైసాభాను ఇలియాస్‌ను రాడ్‌తో కొట్టి గాయపర్చింది. ఇలియాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. 18న ఇలియాస్ రైసాభాను తలపై సుత్తితో గాయపర్చాడు. చికిత్స పొంది కోలుకున్న రైసాభాను శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

జన్నారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సిటిజన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్ సాయిండ్ల మొండయ్య, రిటైర్డు తహసీల్దార్ రాజయ్యలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో సీనియర్ సిటిజన్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ మోసాలను ఎలా అరికట్టాలి, వయోవృద్ధుల పోషణ, హక్కులపై అవగాహన కల్పించారు. కస్తూరి నాగేశ్వర్‌రావు, గోపి సత్యనారాయణ, భాస్కర్‌గౌడ్,పుల్లయ్య, పాల్గొన్నారు.

హెల్మెట్ ఉండదు...
ట్రాఫిక్ రూల్స్ పాటించరు

- ప్రమాదాలబారిన ద్విచక్రవాహనదారులు
- రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే బాధితులు
- దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు



హెల్మెట్ లేకుండా బైక్ నడుపుతున్న వ్యక్తి

బెజ్జూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డుప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో తమ జీవితాలతో పాటు కుటుంబాలను అంధకారంలోకి నెడుతున్నారు. ముఖ్యంగా యువత వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. హెల్మెట్ ధరించక పోవడంవల్ల ఎక్కువమంది జీవితాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో అధికశాతం ద్విచక్ర వాహనాలు నడుపుతున్నవారే ప్రమాదాల బారిన పడుతుండటంతో వారికుటుంబాలు చిన్నాభిన్న మవుతున్నాయి. హెల్మెట్ ధరించక పోవడం వల్లే ప్రమాదతీవ్రత పెరుగుతోందని పోలీసులు చెబుతున్నారు.

మచ్చుకు కొన్ని..

రోడ్డుప్రమాదాల కారణంగా ఎక్కువగా యువత మృతి చెందుతున్నారన్నది వాస్తవం. బెజ్జూరు మండలంలో ఏప్రిల్ 25న కుకుడ-పోతేపల్లి గ్రామాల మధ్య ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురువ్యక్తులు మృత్యువాత పడ్డారు. జూన్‌లో బారేగూడ గ్రామసమీపంలో అమ్మమ్మను ద్విచక్రవాహనంపై మనవడు తీసుకవస్తుండగా అదుపుతప్పి అమ్మమ్మ అక్కడికక్కడే చనిపోయింది. గతేడాది సబ్‌స్టేషన్ వద్ద ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు చనిపోయారు. గతేడాది అందుగులగూడ వద్ద జరిగిన ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు చనిపోయారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఎక్కడో ఓచోట రోజు రోడ్డుప్రమాదరూపంలో యువత మృత్యువాత పడుతున్నా హెల్మెట్ వాడటం లేదు.

ప్రమాద బీమాపై అవగాహన కరువు..

రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో చాలామంది జీవితాలు అర్థాంతరంగా ముగుస్తున్నాయి. దీంతో వారి కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ పరిణామం తీవ్రప్రభావం చూపుతోంది. కుటుంబపోషకుడు ప్రమాదవశాతు మరణిస్తే ఆ కుటుంబసభ్యుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. వాహనం నడిపే ప్రతివ్యక్తి బాధ్యతగా ప్రమాదబీమా తీసుకుంటే ప్రమాదవశాతు మరణించినా, అంగవైకల్యం వచ్చినా బీమా ఆదుకునే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్యతరగతి ప్రజల కోసం ప్రవేశపెట్టిన బీమా పథకాలపై అవగాహన లేక వాటిని కోల్పోతున్నారు.

ప్రతివ్యక్తి హెల్మెట్ ధరించాలి..



వాహనాలు నడిపే ప్రతివ్యక్తి ట్రాఫిక్‌రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలి. ట్రాఫిక్‌రూల్స్‌ను పాటించ డం ద్వారా ప్రమాదాలు జరిగే ఆస్కారం చాలా తక్కువ. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు బయట కు వెళ్తున్న క్రమంలో హెల్మెట్ ధరిస్తే ఎలాంటి ప్రమా దాలు జరగవు. జరిగినా ప్రాణనష్టం తక్కువగా ఉంటుంది. ప్రతివాహనదారుడు విధిగా బీమా చేసు కోవాలి. ఇప్పటికే ప్రమాదాలు, వాహనబీమాపై అవ గాహన కల్పిస్తున్నాం.

\- విక్రమ్, ఎస్సై, బెజ్జూరు

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెబ్బెన, అక్టోబరు 25: మండల కేంద్రంలో శుక్రవారం మాజీమంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు ఎల్ రమేష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన సభలో మాజీమంత్రి కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యాలు చేయటం దారుణమన్నారు. హామీలిచ్చి అమలు చేస్తున్న ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, మోడెం చిరంజీవి గౌడ్, మాజీ సర్పంచ్‌లు చెన్న సోమశేఖర్, లెండుగురే గంటుమేర, మనేం కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోసమే పోలీసులు: ఎస్సై



విద్యార్థులకు పోలీసుల విధులను వివరిస్తున్న ఎస్సై మాధవ్‌గౌడ్

తిర్యాణి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసమే పోలీసులు పనిచేస్తూ ఉంటారని తిర్యాణి ఎస్సై మాధవ్‌గౌడ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులకు ఓపెన్‌హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లోని వివిధ విభాగాలు అవిఎలా పనిచేస్తాయో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, రవీందర్, కానిస్టేబుళ్లు శంకర్, శ్రీనివాస్, రజిత, అపర్ణ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై రైతులకు అవగాహన

దహెగాం, అక్టోబరు 25: మండలంలోని ఒడ్డుగూడలో ఏడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో జనసురక్ష ప్రోగ్రాంలో భాగంగా రైతులకు బ్యాంకుసేవలపై నాబార్డు డీడీఎం వీరభద్రం అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్‌పెన్షన్ యోజన, జన్‌ధన్ అకౌంట్ గురించి వివరించారు. ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ మేనేజర్ రుషిదేవ్, ఎఫ్‌ఎల్‌సీ అంజన్న, పీఏ సీఎస్ కార్యదర్శి బక్కయ్య, ప్రదీప్, సీఫల్, రాజబాబు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో వైద్యశిబిరం

వాంకిడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖానాపూర్ గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న పలువురి నుంచి రక్త నమునాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రవిదాస్, సిబ్బంది దివ్య, హేమంత్, రాఘవి తది తరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

పెంచికలపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయంశక్తితో ఎదగాలని మాజీసర్పంచ్ రాజన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లూరు గ్రామా నికి చెందిన కొడప శ్రీనివాస్, శిరీష దంపతు లకు కుట్టుమిషన్ అందజేశారు. ఉత్తరప్రదే శ్‌కు చెందిన స్వచ్ఛందసంస్థ వారు జిల్లా లోని మండలాన్ని ఎంపికచేసుకుని సామాజి కసేవలు అందించడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో నాయకులు భుజంగరావు, రాజాగౌడ్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవటం దారుణం

రెబ్బెన, అక్టోబరు 25: రైల్వేలో రిటైర్డ్ అయిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవటం దారుణమని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్ తెలిపారు. శుక్రవారం రెబ్బెన రైల్వేస్టేషన్‌లో నిరసన కార్యక్రమాన్ని చేప ట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వే బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసహంరించాలన్నారు. తక్షణమే ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, చాపిడి శ్రావణి, సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీష్, జిల్లా సభ్యులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

లేబర్ సైట్‌ను పునరుద్ధరించాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : లేబర్ సైట్‌ను పునరుద్ధరించాలని ఎంసీపీఐయూ, ఏఐసీటీయూ నాయకులు బెల్లంపల్లి పట్టణంలో అడ్డా కూలీలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎంతో మంది పేదలు, యువకులు కూలీ పనులు చేసుకుంటున్నారని, రెండు నెలలుగా కార్మిక శాఖకు చెందిన ఆన్‌లైన్ సైట్ పని చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త లేబర్ కార్డులకు దరఖాస్తులు చేసుకోలేకపోతున్నారన్నారు. వెంటనే లేబర్ సైట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆరెపల్లి రమేష్, రామకృష్ణ, సత్తయ్య, పాల్గొన్నారు.

నర్సరీ పనులను వేగవంతం చేయాలి

వేమనపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నర్సరీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నర్సరీల్లో టార్గెట్‌కు తగిన విధంగా మొక్కలు పెంచాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి లబ్ధిదారులను గుర్తించి పనులు మొదలు పెట్టాలన్నారు. ఏపీవో సత్య ప్రసాద్, సీఎల్‌ఆర్‌సీ సురేష్, ఈసీ మధుకర్, పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మందమర్రిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ సతీష్‌కుమార్, ఆర్‌ఐ గణపతికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల కోట్లకుపైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, దీని వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. శ్రీహరి, రుషి, జయంత్, రేష్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

గర్మిళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320జీ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం క్లబ్ సభ్యులు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో 15 మంది రక్తదానం చేశారు. ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, దోతులు పంపిణీ చేశారు. గర్మిళ్ల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందించారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, లయన్ సభ్యులు హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రామకృష్ణాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గ కాలనీకి చెందిన బర్ల హర్షవర్ధన్ అనారోగ్యంతో ఈ నెల 19న మృతి చెందాడు. ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ కుటుంబానికి రూ.18 వేల ఆర్థిక సహాయం అందించారు. నట్ల మహేందర్, సురేష్, సతీష్, బీనవేన సంపత్, కనుకుంట్ల సుభాష్, పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను ప్రకటించాలి

దండేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం వెల్గనూర్, ద్వారక, గుడిరేవు, దండేపల్లిపాఠశాలలో ఎమ్మెల్సీనమోదు పత్రాలను ఉపాధ్యాయులకు అందజేశారు.

● లింగాపూర్ ఆదర్శపాఠశాలలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపత్రాలను పీఆర్‌టీయూటీఎస్‌నాయకులు పంపిణీచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.రాసపల్లిరవి, మల్లేష్ నాగేశ్వర్‌రావు, మనోహర్, పాల్గొన్నారు.



సింగరేణిలో ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశాలు ఎక్కువ: జీఎం

రెబ్బెన, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉన్నతాస్థాయికి ఎదిగే అవకాశాలు ఎక్కువ ఉంటాయని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జీఎం కాన్ఫరెన్స్‌హాలులో మెడికల్ ఇన్వాలిడేషన్ ఉద్యోగుల ముగ్గురు వారసులకు ఉద్యోగనియామకపత్రాలను అందజేశారు. తొమ్మిది మంది బదిలీ వర్కర్లకు సర్ఫేజ్ జనరల్‌మజ్దూర్ పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగంలో చేరే యువతి, యువకులు నిబద్ధతో పనిచేసి సంస్థ, వారి కుటుంబ ఎదుగుదలకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు బయ్యు మొగిలి, ఎస్‌వోటుజీఎం రాజమల్లు, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహర, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా జీఎం శ్రీనివాస్

శిక్షణ తర్వాతనే ఉద్యోగాలు

కాసిపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న మహిళ బదిలీవర్కర్లు, జనరల్ మజ్దూర్‌లకు శిక్షణ అనంతరం సంబంధిత ఉద్యోగాలకు పంపిస్తామని ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మందమర్రి డివిజన్ పరిధిలోని కాసిపేట 1వగనిలో మహిళాకార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్ఫేస్‌లో గల 16డిజిగ్నేషన్‌లలో ఉద్యోగావకాశాలున్నాయని, మహిళ కార్మికులకు వీటిపై పూర్తిశిక్షణ ఇచ్చిన అనంతరం ఉద్యోగాల్లో నియమిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి మహిళా కార్మికురాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, డాక్టర్ జయవాణి, కేకే గ్రూపు ఏజెంటు రాందాస్,కాసిపేట గని మేనేజర్ భూశంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

మందమర్రి టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శరీర దారుఢ్యం, ఆరోగ్యం లభిస్తుందని మందమర్రి రెస్క్యూస్టేషన్ ఇన్‌చార్జి రాంమోహన్ తెలిపారు. శుక్రవారం మందమర్రి ఏరియా కార్మిక వార్షిక క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యంత కఠోర క్రీడ ఏదైనా ఉందంటే అది ఫుట్‌బాల్ అని తెలిపారు. ఈ క్రీడ అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి భీమనాథుని సుదర్శన్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని సింగరేణికాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ అన్నారు. ఆర్కే7 గనిపై కాంట్రాక్ట్ కార్మికులతో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వేతనాలు పెంచేందుకు అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు ఏఐటీయూసీ అనుకూలంగా ఉన్నప్పటికీ యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తోందని ఆరోపించారు. వెంటనే స్పందించి వేతనాలు పెంచకపోతే తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, భరత్, శ్రీనివాస్, నర్సింగం, ఆదిత్య, దిలీప్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

మెరుగైన బోనస్ సాధించిన ఘనత మాదే: హెచ్‌ఎంఎస్

మందమర్రి టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికులకు రూ.93750ల బోనస్ సాధించిన ఘనత తమ యూనియన్‌దేనని హెచ్‌ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడుతూ మొదట రూ.85వేలు ఇస్తామని వెల్లడించినప్పటికీ తమ యూనియన్ పట్టుపట్టడంతో రూ.93వేలు ఇచ్చారన్నారు. కొన్ని సంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, కార్మికులు గమనించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎంఎస్ నాయకులు వెల్డి సుదర్శన్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

నస్పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆయుర్వేద వైద్యం, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి తదితర సమస్యలకు చికిత్స అందించారు. ఆయుష్ వైద్యాధికారి, జిల్లా ఇన్‌చార్జి పద్మజా, ఫార్మసిస్టు పుష్పాంజలి, ఎన్‌సీఎస్ కిషన్, కేజీబీవి ప్రత్యేక అధికారి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

భీమారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు కొమ్ము అశోక్ యాదవ్ అధ్యక్షతన వన్ ఆసుపత్రి టీం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మహేష్‌రెడ్డి, ఎస్‌ఐ శ్వేత, ఎంపీడీవో మధుసూదన్‌లు ప్రారంభించారు. శిబిరంలో దాదాపు 200 మంది ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ చాలా మంది జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలియడంతో కరీంనగర్‌లోని వన్ ఆసుపత్రి సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్‌లు గోవింద్ జాదవ్, హరితరెడ్డి,సాయికృష్ణ, శివకుమార్‌రెడ్డి, శ్రీకాంత్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసాద్, కార్యదర్శి రాజశేఖర్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న హరిత మేనేజర్



జన్నారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల్లో భాగంగా జన్నారం హరిత రిసార్ట్స్ మేనేజర్ వీరేంద్రకుమార్ ఎక్సలెంట్ అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు హైద్రాబాద్‌లోని హరిత రిసార్ట్స్ హెడ్ ఆఫీస్‌లో రాష్ట్ర టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం ప్రశంసా పత్రాన్ని అందించారు.



కొత్తిమీర తీస్తున్న రైతులు

కూరగాయల సాగులో రాణిస్తున్న రైతులు

- అంతర పంటగా సాగుతో లాభాలు
- ఆర్థికంగా ఎదుగుతున్న రైతులు

భీమిని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనుల్లో భర్తలకు తోడుగా భార్యలు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ముఖ్యంగా మహిళలు కూరగాయల సాగులో రాణిస్తున్నారు. భీమిని, కన్నెపల్లి మండలాలకు చెందిన రైతులు అంతర పంటలుగా కూరగాయలు సాగు చేస్తున్నారు. రైతులు కూరగాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. పండించిన కూరగాయలను బెల్లంపల్లి, మంచిర్యాల పట్టణాలకు తరలించి లాభాలు గడిస్తున్నారు. ఈ గ్రామాల రైతులు ఏళ్ళుగా కూరగాయలు, పసుపు పంటను సాగు చేస్తున్నారు. సీజన్ల వారీగా టమాట, బెండ, మిరపకాయలు, కాకర, అల్సంత, బీర, చిక్కుడు, ఉల్లి, పసుపు, ఆకుకూరలు, కొతిమీర తదితర పంటలను పండిస్తున్నారు. మహిళలు కూరగాయలు తెంపడంతోపాటు మార్కెట్‌కు తరలించి విక్రయాలు చేరపడుతున్నారు.

రైతులే విక్రయాలు జరుపుతూ జీవనోపాధి పొందుతున్నారు. ఒక్కో రైతు రోజూ రూ. 1000 నుంచి రూ. 1500 వరకు సంపాదిస్తున్నారు.

బంతి పూల సాగుతో..

తాండూర్ (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలం కొత్తపల్లిలో మహిళలు బంతిపూల సాగుతో సిరులు పండిస్తున్నారు. గ్రామంలో ఆరు కుటుంబాలు బంతి పూలసాగు చేస్తున్నారు. స్వల్ప పెట్టుబడి, తెగుళ్ళ, చీడ పీడల బాధలు ఎక్కువగా ఉండవు. దీపావళి సందర్భంగా పూజలు, వ్రతాలతో మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని ఆశిస్తున్నారు.

పండుగలను దృష్టిలో పెట్టుకొని...

వరుస పండగలను దృష్టిలో పెట్టుకొని బంతిపూలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని పూలు సాగు చేశారు. అందులోనూ బంతి పూలకు కేవలం నలభై ఐదురోజులు మాత్రమే ఉంటుంది. దీంతో లోకల్ బంతి పూలు కాకుండా నీటి ఎద్దడికి తట్టుకునే పరిమాణంలో పెద్దగా ఉండే పూలను ఎంచుకొని సాగు చేశారు. వినాయకచవితి, బతుకమ్మ, దసరా పండగలకు వ్యాపారులు తోటల వద్దకు వచ్చి పూలను కొనుగోలు చేశారని తెలిపారు. నాటిన రెండునెలల వ్యవధిలోనే పెట్టుబడి వచ్చిందన్నారు. ఎకరానికి 12 టన్నుల పూలు దిగుబడి వస్తుందన్నారు. మొదటి కాపు, రెండో కాపు పోను మళ్లీ నీటి తడులు అందిస్తే మూడో కాపు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పదేళ్లుగా పూల సాగు చేస్తున్నామని కొత్తపల్లి బంతిపూల సాగుదారులు తెలిపారు.



కొత్తపల్లి గ్రామంలో సాగు చేస్తున్న బంతిపూల తోట

వ్యవసాయమే ఆధారం...



వ్యవసాయం చేస్తూ దిగు బడులు పొందుతున్నా. కూరగాయలు సాగుచేసి బెల్లంపల్లి మార్కెట్‌కు తరలిస్తా. వర్షాభావ పరిస్థితులో కూడా వాగులోని నీటి ద్వారా కూరగాయలు సాగుచేస్తాం. వ్యవసాయమే జీవనాధారం. కూరగాయల సాగుకు నీటి అవసరం తక్కువగా ఉంటుంది. కూరగాయల సాగులో నష్టాలు చవిచూడలేదు.

- ఆదే రవి, మామిడిపల్లి (భీమిని)

అంతర్ పంటలు సాగు చేస్తా



ఎకరం భూమిలో అరెకరం పసుపు సాగు చేస్తాను. పసుపు పంటలోనే అంతర్ పంటగా చిక్కుడు, మిర్చి పండిస్తాను. వర్షాలు పడకపోయినా నష్టాలు ఉండవు. మిగతా భూమిలో ఉల్లి, వెల్లులి, మిర్చి, మిగతా పంటలు పండిస్తాను.

- గుర్లె సుందరి బాయి, మామిడిపల్లి

కూరగాయల పందిరికి రాయితీలు



కూరగాయలు పండించే రైతులకు 50 శాతం సబ్సిడీపై పందిర్లు ఇస్తాం. డ్రిప్ పైపులు 90 శాతం రాయితీ ఉంది. ఆసక్తిగల రైతులు రాయితీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

-అరుణ్ కుమార్, హార్టికల్చర్ అధికారి, బెల్లంపల్లి

ప్రభుత్వం ప్రోత్సహించాలి



రాష్ట్ర ప్రభుత్వం రాయితీ పై రుణాలు, డ్రిప్, ఇచ్చి ప్రోత్సహించాలి. సొంతంగా ఉన్న ఎకరంతోపాటు మరి కొంత భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తాను. పెట్టుబడిపోను ఎకరానికి 50 వేలు పైగా లాభం వస్తుంది.

- గజ్జెల ఆమని, కొత్తపల్లి

ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి



బంతి సాగులో ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ధర ఎక్కువ తక్కువ అయిన దీపావళి సీజన్లో కలిసి వస్తుందని ఆశిస్తున్నాం. విత్తనం తీసుకోవడమే ముఖ్యం. ప్రధానంగా పూల విత్తనం ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకోవాలి.

- మురికె లక్ష్మీ, కొత్తపల్లి

ధాన్యం అమ్మకాల గోస తీరేనా..?

(5వ పేజీ తరువాయి)

గోనె సంచుల కొరత తేరేనా...?

గోనె సంచులు, లారీల సమస్య ప్రతీ సారీ వేధిస్తూనే ఉంది. ధాన్యం కొనుగోళ్లకు సంచుల కొరత లేదని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రంగానే ఉంది. ఈ విషయంలో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంచులు లేవనే నెపంతో వారంలో ఓ రోజు కొనుగోళ్లను నిలిపి వేసిన సందర్భాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు 82.49 లక్షల గోనె సంచులు అవసరం కాగా, ప్రస్తుతం 30 లక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో 52.49 లక్షల సంచులను సేకరించాల్సి ఉండగా, జూట్ మిల్లుల నుంచి తెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. లారీల కొరత కారణంగా కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను తరలించక పోవడంతో అకాల వర్షాలకు తడుస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని తీసుకోవడానికి మిల్లర్లు తిరస్కరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో జీవో ప్రకారం అయిదుగురు సిబ్బంది ఉండాలి. కేవలం ఒకరిద్దరితో కొనుగోళ్లు చేస్తుండడంతో ఆలస్యం జరుగుతోంది.

వేధిస్తున్న స్థల సమస్య...

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థల సమస్య వేధిస్తోంది. అరకొరగా ఉన్న స్థలాల్లో ధాన్యం ఆరబోసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రహదారులపై ధాన్యం ఆరబోయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో మాదిరిగా ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అందించడం లేదు. అలాగే మార్కెటింగ్ అధికారులూ కేంద్రాలకు సరఫరా చేయడం లేదు. నవంబరు మొదటి వారంలో వానాకాలం కోతలు ప్రారంభిస్తారు. దీంతో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే అక్కడక్కడ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా, పూర్తిస్థాయిలో ప్రారంభం అయ్యేలోపే అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుంది. కాగా అక్టోబరు చివరి వారం కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు.

క్రీడా సమాచారం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థి బ్లెస్సి ని అభినందిస్తున్న హెచ్ఎం, పీడీ

దండేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని ఎం.బ్లెస్సి రాష్ట్రస్థాయి వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మంత్రి రాజు, పిడి శ్రీనివాస్‌లు తెలిపారు. గురువారం నిర్మల్ జిల్లా గుండంపల్లిలో జరిగిన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి అండర్ 17 బాలికల విభాగంలో బ్లెస్సి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 28నుంచి 30 వరకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ ఫణిరాజా, హెచ్ఎం, పీడీ అభినందించారు.

తాండూర్‌లో...

తాండూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చలాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని అమూల్య ఎస్‌జీఎఫ్ అండర్ 17 జిల్లాస్థాయి బాలికల వాలీబాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థిని ఈనెల 28 నుంచి గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తెలిపారు. విద్యార్థిని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా, పాఠశాల చైర్మన్ చిలుకమ్మ, అభినందించారు.

అండర్ 19 బాలుర ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రామకృష్ణాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో అండర్ 19 బాలుర ఫుట్‌బాల్ ఎంపిక పోటీలను నిర్వహించారు. పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ పిన్నింటి రఘునాథరెడ్డి ప్రారంభించారు. పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బాబురావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రాజయ్య, కోచ్ రవికుమార్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జోనల్ స్థాయి ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-14, 17 జోనల్‌స్థాయి (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా) బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరి సిహెచ్.ఫణిరాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి నుంచి జోనల్‌స్థాయికి ఎంపికైన క్రీడాకారులు అర్హులని ఆయన తెలిపారు. వయసు ధ్రువీకరణ పత్రం, బొనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు పోటీల కన్వీనర్ సుకుమార్ ఫ్రాన్సిస్‌ను కలిసి రిపోర్టు చేయాలని, వివరాలకు 9989001703 నంబర్‌ను సంప్రదిం చాలని కోరారు.

రేపు వూషూ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): సీసీసీలో జిల్లా క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-17 బాలబాలికల జిల్లాస్థాయి వూషూ ఎంపిక పోటీలను ఈ నెల 27న ఆదిత్య హై స్కూల్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఫణిరాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు బొనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు (జిరాక్స్) తెచ్చుకోవాలని తెలిపారు. ఉదయం 9 గంటలలోపు రిపోర్టు చేయాలని, స్కూల్ కోచ్ శివమహేష్ 9652508672ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ముగిసిన క్రీడలు



లక్షెట్టిపేటరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబాపూలే బాలుర పాఠశాల ఆవరణలో రెండు రోజులుగా నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి పోటీలు ముగిసాయి. వివిధ ప్రాంతాల ఎంజేపీ బాలుర పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఆర్‌సీవో గోపిచంద్, డీసీవో శ్రీధర్‌లు మాట్లాడారు. గెలిచిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ రొనాల్డ్ కిరణ్, పీడీ, పీఈటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాకో ఆలయం వద్ద సందడి



గుస్సాడీ వేషధారణతో ఆలయానికి వస్తున్న గిరిజనులు

దండేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుడిరేవు పద్మల్‌పురి కాకో ఏత్మల్‌సార్ పేన్ ఆలయానికి గిరిజనులు తరలివస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి శుక్రవారం కుటుంబ సమేతంగా గిరిజనులు తరలివచ్చి గోదావరి స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు డప్పువాయిద్యాలతో గుస్సాడీ వేషధారణతో ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. ఆలయం వద్ద పిండి వంటలు తయారు చేసి కోళ్లను, మేకలను బలి ఇచ్చారు. గుస్సాడి నృత్యాలతో మహిళలు రేలా రేలా ఆటాపాటలతో సందడి చేశారు.

దండారి దర్బార్ పోస్టర్ల విడుదల



తహసీల్దార్ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్, ఆదివాసీ నాయకులు

కాసిపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సల్పల వాగు వెంకటాద్రి ఆలయంలో ఈ నెల 27న నిర్వహించే దండారి దర్బార్ పోస్టర్లను శుక్రవారం తహసీల్దార్ భోజన్న విడుదల చేశారు. దర్బార్ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆడె జంగు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు యేటా దర్బార్‌ను నిర్వహిస్తున్నామన్నారు. దర్బార్‌లో గిరిజన సమస్యలను పరిష్కరించేలా సహకరించాలని కోరారు. నిర్వహణ కమిటీ సభ్యులు పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, సిడాం రాందాస్, ఆత్రం జంగు తదితరులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధ సదస్సుకు తరలిరండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మందమర్రి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జన్నారంలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 27న తలపెట్టిన మాదిగల ధర్మయుద్ధ సదస్సుకు మాదిగ కుటుంబాలు తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల సుప్రీంకోర్టు ఏబీసీడీ వర్గీకరణకు సంబంధించి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో దీనిని అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నాయకులు రాచర్ల నరేష్, సారంగం, రాజు, కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

భీమారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో మదుసూదన్ సూచించారు. శుక్రవారం దాంపూర్, భీమారం గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రోజు పారిశుధ్య పనులను నిర్వహించాలని కార్యదర్శులకు సూచించారు. అర్కపల్లి, ధర్మారాం, కాజీపల్లి, దాంపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను పరిశీలించారు. కార్యదర్శి శ్రీనివాస్,ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇక అపార్ కార్డు

- జాతీయ విద్యా విధానంలో భాగంగా అమలుకు విద్యాశాఖ చర్యలు
- తల్లిదండ్రుల అనుమతి , హెచ్ఎం ధ్రువీకరణ

సమాచారం



నమూనా అపార్ కార్డు

కోటపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యక్తికి ఆధార్ కార్డు ఎలా ఉందో... విద్యార్థులకు అపార్ కార్డు తప్పనిసరి. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థి సమగ్ర సమాచారం కోసం అపార్(ఏపీఏఆర్ ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) ఉపయోగపడనుంది. 12 అంకెలతో కూడిన నంబర్ కేటాయించి వారి సమగ్ర సమాచారం నిక్షిప్తం చేస్తారు. వన్‌నేషన్ వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ నూతన అధ్యాయనానికి శ్రీకారం చుడుతోంది. జాతీయ నూతన విద్యా విధానం అమలులో భాగంగా ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలుస్తోంది. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివే ప్రతీ విద్యార్థికి ఓ గుర్తింపు నంబరు ఉంటుంది. ఈ మేరకు అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అపార్‌కార్డు ద్వారా కేటాయించిన సంఖ్య జీవిత కాలం ఐడీగా పరిగణిస్తారు. విద్యార్థికి సంబంధించిన పూర్వ వివరాలు, సాధించిన విజయాలు, ఉపకార వేతనాలు, మెమోలు, ధ్రువపత్రాలు తదితర సమగ్ర సమాచారం అంతా ఇందులో ఉంటుంది.

తల్లిదండ్రుల సమ్మతితోనే...

అపార్ కార్డు విద్యార్థులకు అందించేందుకు తల్లిదండ్రుల సమ్మతి తప్పనిసరి. అయితే అపార్‌కార్డు వివరాలు పూర్తి గోప్యంగా ఉంటాయి. దీనిపై ఇప్పటికే ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలల్లో, ఆధార్‌కార్డుల్లో వివరాలు ఒకేలా ఉండాలని, లేనివారు మార్పులు చేసుకోవాలని సూచించారు. తర్వాత మార్పులకు అవకాశం ఉండదని అపార్ కార్డు ప్రాముఖ్యాన్ని వివరించారు. అంగీకార పత్రాలపై తల్లిదండ్రుల సంతకం తీసుకోవాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

పొందడం ఎలా...

విద్యార్థుల వివరాలు ఇప్పటికే యు డైస్ ప్లస్‌లో నమోదు చేసినందున అందులోనే తల్లిదండ్రులు సూచించిన సవరణలు చేసి ఆన్‌లైన్‌లో అపార్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి. అంగీకార పత్రంపై తల్లిదండ్రుల సంతకం ఎలాగో ప్రధానోపాధ్యాయుని ధ్రువీకరణ తప్పనిసరి. అలాగే ఆధార్‌కార్డుకు అనుసంధానమైతే మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది. దీని ద్వారా అపార్ కార్డును పొందవచ్చు.

అకాడమీ పరంగా ప్రయోజనం

విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫోటో, క్యూఆర్ కోడ్ ఇలా 12 అంకెలతో నంబరు డిజిటల్ కార్డులో ఉంటాయి. అకాడమీ సమాచారం, విద్యార్థి విజయాలు ఎప్పటికప్పుడు నమోదువతాయి. విద్యార్థి సమాచారం మొత్తం ఒకేచోట లభిస్తుంది. ఆన్‌లైన్ నెంబరు నమోదు, క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసినా పూర్తి వివరాలు తెలుస్తాయి. విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు మారేటప్పుడు ఈ కార్డు వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఉపకార వేతనాలు, వారు పొందుతున్న ప్రయోజనాలు తదితర విషయాలన్నీ ఉద్యోగాల భర్తీ సమయంలో అపార్ ఆధారంగా సమాచారమంతా తెలుసుకోవచ్చు.

భవిష్యత్‌లో కీలకం



అపార్‌కార్డు విద్యార్థులకు భవిష్యత్‌లో కీలకం కానుంది. ఒకే నంబరులో పూర్తి వివరాలు నమోదు కానున్నాయి. ఇప్పటికే దీనిపై పాఠశాలల ప్రధానో పాధ్యాయులకు సమాచారం ఇచ్చాం. తల్లిదండ్రుల అనుమతి పత్రం తప్పని సరిగా తీసుకోవాలని సూచించాం. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.

- యాదయ్య, డీఈవో , మంచిర్యాల

ఆంధ్రజ్యోతి



5

మంచిర్యాల
జిల్లా వార్తలు

శనివారం 26 అక్టోబరు 2024



ధాన్యం అమ్మకాల గోస తీరేనా..?

- కేంద్రాల వద్ద కనీస వసతులు కరువు
- టార్పాలిన్లు లేక అకాల వర్షాలకు పంట నీటిపాలు
- గోనె సంచుల కొరతతో రవాణాలో అవస్థలు
- ధాన్యం అమ్మకాలలో రైతులకు తప్పని తిప్పలు
- జిల్లాలో 267 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- మూడు లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం

మంచిర్యాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పంట చేతి కొచ్చి విక్రయించే వరకు రైతన్నలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా సమస్యలు అలాగే ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రతీ సీజన్‌లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారు. టార్పాలిన్లు లేకపోవడంతో అకాలవర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతోంది. ధాన్యాన్ని ఆరబోసేందుకు చాలి నంత స్థలం లేకపోవడంతో తేమ సమస్యను ఎదుర్కొంటున్నారు. తేమ శాతం సాకుగా చూపి కేంద్రాల నిర్వాహకులు కొర్రీలు పెడుతున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలోనూ రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రైస్‌మిల్లులకు తీసుకువెళ్లిన తర్వాత మిల్లర్లు ధాన్యం సరిగా లేదని తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఇలా అడుగడుగునా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలపై పౌర సర ఫరాల శాఖ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిపెట్టడం లేదు. ఈ సీజన్ లో అయినా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

మిగతా 7వ పేజీలో

కొనుగోలుకు సన్నాహాలు...

వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి గత నెల 25న అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అక్టోబరు చివరి వారం నుంచి పంట దిగుబడులు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. గన్నీ బ్యాగులు, వాహనాలు, కూలీలను సమకూర్చుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ యేడాది కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు రూ.2320 కాగా సాధారణ రకానికి రూ.2300 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ క్వింటాలుకు రూ. 500ను అందించేందుకు మంత్రి సుముఖత వ్యక్తం చేయడంతో ధాన్యం క్వింటాలు ధర రూ. 2800 ప్రకారం రైతులకు దక్కనుంది. పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం ఇక్కడి రాకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 267 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. 3,29,983 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



చెకుముఖి సైన్స్ సంబురాలను విజయవంతం చేయండి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక చెకుముఖి సైన్స్ సంబురాలు-2024ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నవంబర్ 7న పాఠశాల స్థాయి, 21న మండల, 28న జిల్లా, డిసెంబర్ 14, 15, 16వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ పాఠశాలలు రూ.5, ప్రైవేట్ పాఠశాలలు రూ.10 ప్రవేశరుసుము చెల్లించి పాల్గొనాలని తెలిపారు. 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు అర్హులని, పూర్తి వివరాలకు జన విజ్ఞానవేదిక బాధ్యులు ఎడ్ల కిషన్ 9705224515 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, జేవీవీ గౌరవ అధ్యక్షుడు దేవయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోడప్రతులను విడుదల చేస్తున్న డీఈఓ

నియోజకవర్గంలో విద్య, వైద్యానికి పెద్దపీట



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నానని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆయన ఆంధ్రజ్యోతి తో మాట్లాడుతూ పదవులపై ఆశ లేదని, ప్రజా సేవే ప్రధాన కర్తవ్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల కాలంలో నియోజకవర్గానికి రూ.500 కోట్లు మంజూరు చేయించానని పేర్కొన్నారు. విశాఖ చారిటబుల్ ట్రస్టు ద్వారా బోర్‌వెల్స్ వేస్తున్నామని, పాఠశాలలో విద్యార్థులకు బెంచిలు అందజేస్తున్నామని తెలిపారు. తండ్రి కాక వెంకటస్వామి స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. చెన్నూరులో వంద పడకల ఆసుపత్రి, పాఠశాలల అభివృద్ధికి చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. తన పేరు చెప్పుకొని భూ కబ్జాలు, ఇసుక దందాలు చేపడితే సహించబోమని తెలిపారు. మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలకు ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు. మందమర్రి ఏరియాలో కేకే 6, శ్రావణపల్లికి సంబంధించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చానని తెలిపారు. పని చేసే నాయకులకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని ఆయన చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వేణుగోపాల్, అసిస్టెంట్ ఇంజనీర్ నర్సయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌నగర్, తెలంగాణ నగర్, దొరగారిపల్లె, రాజరాజేశ్వర కాలనీ, గోపాల్‌వాడ, హమాలీవాడ, సూర్యనగర్, తిలక్ నగర్, తోళ్లవాగు, తిరుమలగిరి కాలనీ, గణేష్ నగర్, వినాయకనగర్,చున్నంబట్టివాడ, ఏ క్యాబిన్,వేములబస్తీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన అందించాలి



ఆస్నాద పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆస్నాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి సందర్శించి హాజరు పట్టికలను, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ప్రతీ పాఠశాలలో విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, వంటశాల ప్రహరీ, ఇతర అన్ని వసతులను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. నర్సరీని సందర్శించి మొక్కలను జాగ్రత్తగా పెంచి సకాలంలో అందించాలని సూచించారు. ఎంపీడీవో మోహన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

కోటపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను సందర్శించారు. ముందుగా ఆసుపత్రిని సందర్శించిన ఆయన అక్కడి పరిసరాలు, మందుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల్లో బాధ్యతగా వ్యవహరిస్తూ అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ రిజిష్టర్‌లు, రికార్డులను పరిశీలించారు. వివిధ రకాల దరఖాస్తులను నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కంపోస్టుషెడ్‌ను సందర్శించి తడి పొడి చెత్త నుంచి ఉపయోగపడే చెత్తను వేరు చేసి కంపోస్టు షెడ్‌కు తరలించి సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించాలన్నారు. గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను సందర్శించి హాజరు పట్టికలు, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. షెడ్యూల్డు కులముల సంక్షేమ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందని, చేపట్టాల్సిన పనులపై తెలుసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అందుబాటులో లేకపోవడం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్ మహేంద్రనాథ్, మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి హరిత, సంబంధిత అధికారులు ఉన్నారు.

పశుగణనను పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): పశుగణన కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పశువైద్యాధికారి శంకర్, పశువైద్యులతో కలిసి పశుగణన కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పశుగణనలో ఆవులు, గేదెలు, గొర్రెలు, కోళ్లు, మేకలు, ఇతర జంతువుల సమాచారాన్ని డిజిటల్ పద్ధతిలో మొబైల్ ద్వారా నిక్షిప్తం చేయాలన్నారు. పశుగణన చేసేందుకు 127 మంది ఎన్యూమరేటర్లను నియమించి తగిన శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

ఈనెల 28న రిజర్వేషన్‌ల కల్పనపై బహిరంగ విచారణ

రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల కల్పనపై ఈ నెల 28న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహిస్తామని కలెక్టర్ కుమార్‌దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. వెనకబడిన తరగతుల కులాలు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఆసక్తి గల అభ్యర్థులు పార్టీల నుంచి సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకొంటున్నామని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్, రవాణా, నేషనల్ హైవే రహదారికి సంబంధించిన అధికారులతో సీపీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ప్రమాదాల్లో ఎక్కువ శాతం 18 నుంచి 45 మధ్య వయస్కులే చనిపోతున్నారని, వాటిని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే 63, 363, స్టేట్ హైవే 01, 155, 24, 15లపై బ్లాక్ స్పాట్లను వద్ద పోలీస్, ట్రాఫిక్ అధికారులు, ఇతర అధికారులు సందర్శించి ప్రమాదాలకు కారణాలను గుర్తించాలన్నారు. ప్రమాదాల నివారణకు పరిష్కార మార్గాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘం అవినీతిపై విచారణ

జైపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జైపూర్ ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతిపై శుక్రవారం కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్టర్ పీఏసీఎస్ చెన్నూరు ఫీల్డ్ అధికారి రవికిశోర్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. వైస్‌చైర్మన్ ఎస్. శేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని, జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి జిల్లా స్థాయి అధికారులకు విన్నవిస్తామని పేర్కొన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ చైర్మన్ గుండు తిరుపతి సొసైటీలో ఎలాంటి తీర్మానాలు లేకుండా ఇష్టారాజ్యంగా నిధులు డ్రా చేశారని జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. సంఘంలో రూ.4.50 లక్షల నుంచి వివిధ ఖర్చుల కోసం తీసుకుని ఖర్చు పెట్టలేదని అధికారులకు ఫిర్యాదు చేశానని, ఆఫీసు సామగ్రి పేరుతో అవినీతికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.



జైపూర్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న అధికారులు